నేడు పూలే, అంబేడ్కర్ జన జాతర

నిజాంపేట్: పూలే, డా.బీఆర్ అంబేడ్కర్ జన జాతర సభను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిజాంపేట్‌లోని ప్రగతినగర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాల్‌లో శుక్రవారం జన జాతర సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ అంబేడ్కర్ వాది జె.బి రాజు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి, గోరేటి వెంకన్న, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ జన జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్‌లో శుక్రవారం హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 75 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ దాను, బండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి


కార్మికులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుండిగల్: పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేయడం సరికాదని, వెంటనే చెల్లించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు గోనె మల్లారెడ్డి, నల్ల రామచంద్రారెడ్డి, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార, వాణిజ్య, గృహ నిర్మాణదారులు ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పన్నులు చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల వారీగా బిల్ కలెక్టర్‌లకు టార్గెట్ విధించి ప్రజల్లో ఎర్లీ బర్డ్ పథకం పై అవగాహన కల్పించి ముందస్తు చెల్లింపులు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి


చిన్నారులతో అంగన్‌వాడీ అధికారులు

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని సీడీపీవో శారద అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం 'చిన్ననాటి విద్య' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రీ స్కూల్‌లో భాగంగా రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. పిల్లల భవిష్యత్‌కు అంగన్‌వాడీ స్కూళ్లు పునాది లాంటివన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు ఏ.నాగరాణి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



నిజాంపేట్: బాచుపల్లిలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, బాలికల పాఠశాలను శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా శుక్రవారం సందర్శించారు. కళాశాల ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కళాశాల పక్కనే కొనసాగుతున్న డంపింగ్ యార్డుతో కలుగుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణ అన్నారు.

ఒక్కరోజే 144 రిజిస్ట్రేషన్‌లు

- నిరీక్షణ లేకుండా వేగవంతంగా రిజిస్ట్రేషన్లు
- ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లతో ప్రక్రియ
- స్లాట్ బుకింగ్ ద్వారా 15 నిమిషాల్లోనే ముగింపు


ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు


కార్యాలయంలో క్రయ, విక్రయదారులు

సుభాష్‌నగర్: స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన స్లాట్ బుకింగ్ పైలెట్ విధానం మంచి ఫలితాలను ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10 నుంచి రాష్ట్రంలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పైలెట్ పద్ధతి ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను కేవలం 15 నిమిషాల్లోనే చేసేందుకు ప్రారంభించింది. గతంలో రిజిస్ట్రేషన్ కోసం పనులు మాని కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది.

రికార్డు స్థాయిలో 144 రిజిస్ట్రేషన్‌లు

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 144 రిజిస్ట్రేషన్‌లు విజయవంతంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ కార్యాలయంలో ఒక్కరే సబ్ రిజిస్ట్రార్ అధికారి ఉండగా రోజుకు 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. దీంతో రద్దీ దృష్ట్యా ప్రభుత్వం మరో ఇద్దరిని నియమించింది. స్లాట్ బుకింగ్, ముగ్గురు సబ్ రిజిస్ట్రార్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తప్పింది.

ఇతరులపై ఆధారపడకుండా..

కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చేవారు గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేది. దీంతో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించేది. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది. దీంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15 నిమిషాల్లో పూర్తి చేస్తున్నాం



గతంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గంటల తరబడి జరిగేది. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ ప్రక్రియను తీసుకురావడంతో ప్రక్రియ తొందరగా పూర్తవుతుంది. ఇక క్రయ,విక్రయదారుల ఇబ్బందులు తొలగినట్లే. నాతో పాటు మరో ఇద్దరి సబ్ రిజిస్ట్రార్ అధికారులను నియమించడంతో ఏ ఒక్క ఫైల్ పెండింగ్‌లో పడకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్ కుమార్, సబ్ రిజిస్ట్రార్

తొందరగా రిజిస్ట్రేషన్ చేశారు



బాచుపల్లిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో 1600 ఎస్ఎఫ్‌టీలో ప్లాట్‌ను కొనుగోలు చేశా. రిజిస్ట్రేషన్ నిమిత్తం ఒక రోజు ముందు స్లాట్ బుక్ చేసుకున్న. నిరీక్షణ లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో సమయం ఎంతో ఆదా అవుతుంది. కార్యాలయం చుట్టూ తిరగాల్సిన రోజులు పోయాయి.

– ప్రవీణ్, వ్యాపారి, జేఎన్టీయూ

పార్కును ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఆకుల సతీష్

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని పార్కును ప్రజల కోసం వినియోగించే విధంగా తీర్చిదిద్దాలని బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శుక్రవారం ప్రగతినగర్‌లోని ప్రగతి స్కూల్ పక్కన ఉన్న పార్కు స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యక్తులు దర్జాగా తమ అవసరాలకు పార్కు స్థలాన్ని వినియోగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కును పూర్తిగా వినియోగంలోని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమానికి బీఆర్ఎస్ స్ఫూర్తి

- సభను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్


జగద్గిరిగుట్టలో పార్టీ దిమ్మెకు గులాబీ రంగు వేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఉద్యమస్ఫూర్తిని రగిలించి, రాష్ట్రాన్ని సాధించిన గులాబీ జెండా తెలంగాణ ప్రజలకు ఎల్లవేళలా రక్ష అని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని పలు డివిజన్‌లలో జరిగిన సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌లో పార్టీ జెండా దిమ్మెకు ఎమ్మెల్యే రంగులు వేసి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించే ప్రభుత్వాలను నిలదీసేది గులాబీ జెండే అని అన్నారు. ఘన చరిత్ర కలిగిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుక పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఆయా డివిజన్ల పరిధిలో జరిగిన సమావేశాలకు కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, రషీదా బేగం, విజయశేఖర్‌గౌడ్ మాజీ కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, ఆయా డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

ఘనంగా ఎంఎల్ఆర్ఐటీ 20వ వార్షికోత్సవం


బహుమతి అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

దుండిగల్: దుండిగల్‌కు చెందిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 2005లో స్థాపించిన తమ కళాశాలకు 2015లో యూజీసీ గుర్తింపు లభించిందని, న్యాక్-ఏ గ్రేడ్, ఎన్‌బీఏ టైర్-01 గుర్తింపు పొందడంతో పాటు వరుసగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ సాధించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, డైరెక్టర్లు అనుశ్రేయారెడ్డి, మర్రి ధీరేన్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


సాయి కిరణ్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: చేపలు అమ్ముతానని వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ, దత్తాత్రేయ కాలనీకి చెందిన సాయి కిరణ్ (14) ఈ నెల 22న చేపలు అమ్మడానికి టీవీఎస్‌పై వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న వాహనాల వేలం

కుత్బుల్లాపూర్: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను 29వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ టి.యాదయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి కుత్బుల్లాపూర్ స్టేషన్ ఆవరణలో మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆరు ద్విచక్ర, రెండు త్రిచక్ర వాహనాలకు వేలం పాట వేస్తామని, ఆసక్తి గలవారు రూ.2 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు 8712658741 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వక్ఫ్ సవరణతో పేద ముస్లింలకు లబ్ధి

మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు

కుత్బుల్లాపూర్: వక్ఫ్ అమెండెంట్ యాక్ట్ సవరణతో పేద ముస్లింలకు మేలు జరుగుతుందని, ఈ విషయంలో ముస్లింలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం చింతల్ జయాస్ బ్యాంకిట్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన వక్ఫ్ చట్ట సవరణపై అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వక్ఫ్ బోర్డు ఎప్పుడైనా ముస్లిం పేదలకు ఒక్క రూపాయి సహాయం అందించిందా?, కరోనా సమయంలో పేదలను ఆదుకుందా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వక్ఫ్ చట్టం సవరణ అవగాహన అభియాన్ రాష్ట్ర మెంబర్ నందనం దివాకర్, జిల్లా కన్వీనర్ విగ్నేష్, ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, పద్మయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, బక్క శంకర్‌రెడ్డి, సుధ, భరత్, సింహారెడ్డి, కేశవ్ యాదవ్, మణికంఠ, రాజేష్ చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య భార్గవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీరామ్‌నగర్-ఏ, బీ, భాస్కర్ బస్తీ, 11కేవీ క్రషర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవేందర్‌నగర్, శివ సాయి హిల్స్, వీనస్ రాక్ హైట్స్, దేవేందర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయం, కట్టమైసమ్మ బస్తీ, 11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు షిర్డీహిల్స్, సెవెన్ హిల్స్, కైలాస్ హిల్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుండి 9 గంటల వరకు పైపులైన్ రోడ్డు, జీడిమెట్ల గ్రామం, ఎస్సీ కాలనీ, అరోమ్సబర్గ్ అపార్ట్‌మెంట్స్, సీఎంఆర్ స్కూల్ లేన్, 11కేవీ సెయింట్ ఆన్స్ స్కూల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియా, రెనోవా ఆసుపత్రి, ఎస్‌సీఎల్ కాలనీ, శ్రీనీ ఎవెన్యూ గేట్-3 ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

☛ 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సెంట్రల్ పార్క్, ఎంఆర్ ఫంక్షన్ హాల్, రాజధాని దాబా, 11కేవీ ధోలారీధని ఫీడర్ పరిధిలో పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి గోదాములు, కొంపల్లి బ్రిడ్జి ప్రాంతాలు, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో సురక్ష ఆసుపత్రి లేన్, కొంపల్లి మున్సిపల్ కార్యాలయం లేన్, 11కేవీ గార్డెన్ బస్తీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు జయభేరి కాలనీ, మోడీ బిల్డర్స్, లంబాడీ బస్తీ, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో అశ్విని కాలనీ, జయభేరి బ్యాంక్ కాలనీ, 11కేవీ విగ్నేశ్వర ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు జయభేరి బ్యాంక్ కాలనీ, శివాలయం రోడ్డు, కేవీఆర్ గార్డెన్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.


ఐడీపీఎల్ ర్యాలీలో పాల్గొన్న శ్రీచైతన్య కళాశాలల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రవికుమార్


గాజులరామారంలో శాంతిర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

పోలీసుల సాయంతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ

జీడిమెట్ల: ఇంటి నుంచి తప్పిపోయి రోడ్డుపై తిరుగుతున్న ఓ బాలుడిని జీడిమెట్ల పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ మల్లేష్ వివరాల ప్రకారం.. న్యూఎల్‌బీనగర్ హెచ్ఎంటీ సొసైటీలో నివాసముండే అనిల్, కళల కుమారుడు శివ(3) శుక్రవారం ఇంటి ముందు అడుకుంటూ కనిపించకుండా పోయాడు. బాలుడు షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డుపైకి వచ్చి ఏడుస్తున్నాడు. ఇది గమనించిన స్థానికులు జీడిమెట్ల పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తరలించి వివరాలు అడగగా.. అతని పేరు, తల్లిదండ్రులు, పాఠశాల వివరాలు తెలిపాడు. వెంటనే పోలీసులు సోషల్ మీడియాలో వివరాలను పోస్ట్ చేశారు. తల్లిదండ్రులు జీడిమెట్ల పీఎస్‌కు చేరుకున్నారు. సీఐ బాలుడిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీలు

మృతులకు ఘన నివాళి


చింతల్ ప్రధాన రోడ్డులో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: ఉగ్రదాడిలో వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో శాంతి ర్యాలీలు నిర్వహించారు. మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. ఐడీపీఎల్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రవికుమార్, ఏజీఎం.డి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వివిధ బ్రాంచీల కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సుభాష్‌నగర్‌లోని శ్రీ వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

☛ గాజులరామారం చిత్తారమ్మదేవి నగర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిని ఉపేక్షించేది లేదని, కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


డాక్యుమెంట్ రైటర్ల నిరసన

సుభాష్‌నగర్: అమాయకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం పిరికిపందల చర్యని డాక్యుమెంటు రైటర్లు అన్నారు. ఉగ్ర దాడికి నిరసనగా సూరారంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని డాక్యుమెంట్ రైటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు.


సుభాష్‌నగర్‌లోని శ్రీవివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలుపుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

వరంగల్ సభకు భారీగా తరలాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున తరలి రావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపిత కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. భారీ బహిరంగ రజతోత్సవ సభకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున కదలాలన్నారు. బస్సుల రూట్ మ్యాప్ కో ఆర్డినేషన్ కోసం సతీష్ అరోరా, డివిజన్‌ల వారీగా ఓల్డ్ బోయినపల్లి భోగాది దినేష్ నాయుడు, బాలానగర్ టి. వీరాంజనేయ చారి, బొట్టు విష్ణు, ఫతేనగర్ మొలుగు తిరుపతిరావు, శ్రీనివాస్, మూసాపేట సర్వేశ్వరరావు, అల్లాపూర్ రావెల్ షా, బాలాజీనగర్ పాతూరి గోపి, కేపీహెచ్‌బీ జన్ను సాయి శ్రీనివాస్, కూకట్‌పల్లి బి. సురేష్ కుమార్, బేగంపేట రాధాకృష్ణలను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు.